క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి గోపీనాథ్

ఏలేశ్వరం: ప్రతిఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరమని ప్రత్తిపాడు జూనియర్ సివిల్ జడ్జి లంకా గోపీనాథ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శనివారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు తప్పుడు మార్గంలో పయనించకుండా చట్టప్రకారం నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, ఎస్సై రామలింగేశ్వరరావు, న్యాయవాదులు ఆడారి సుగుణ, బుగత శివ తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

జగ్గంపేట: స్థానిక శ్రీరామ్‌నగర్‌లో రహస్యంగా నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై శనివారం పోలీసుల దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వ్యభిచార గృహం నిర్వహిస్తున్న జి.కాంతం అనే మహిళలతో పాటు ఒక బాధితురాలు, ఇద్దరు విటులను అరెస్టు చేసినట్లు స్థానిక సీఐ వైఆర్‌కే శ్రీనివాస్‌రావు తెలిపారు. భాధితురాలిని ఐసీడీఎస్ అధికారులకు అప్పగించి ఇకపై ఇలాంటి వ్యవహారాల్లో పాల్గొనవద్దని హెచ్చరించారు. విటులు, వ్యభిచార గృహం నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మాన్యువల్ టెస్టింగ్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు మెమెంటో అందజేస్తున్న అధ్యాపకులు

గండేపల్లి: సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు మాన్యువల్ టెస్టింగ్‌పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని తమను తాము మెరుగు పరుచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి కృషి చేయాలి



కత్తిపూడిలో నూతన సొసైటీ కార్యవర్గ సభ్యులతో మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే సత్యప్రభ

శంఖవరం: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) నూతన కార్యవర్గ సభ్యులు రైతుల అభ్యున్నతికి కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు సూచించారు. మండలంలోని కత్తిపూడిలో శనివారం జరిగిన సొసైటీ నూతన చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సొసైటీ చైర్మన్‌గా గాబు కృష్ణమూర్తి, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తారని, వారికి ప్రభుత్వ పరంగా సహాయ సహకారాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు వెన్నా శివ, బద్ది రామారావు, మేడిశెట్టి సూర్యకిరణ్, కరణం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

28న స్పాట్ అడ్మిషన్లు

గోకవరం: మండలంలోని వీరలంకపల్లి బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ, ఇంటర్‌లో ఖాళీల భర్తీకి ఈ నెల 28న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ ఎంవీయూ రాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆధార్ కార్డు, ఇతర సర్టిఫికెట్లతో ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

డ్రగ్స్ నివారణపై అవగాహన

కాకినాడ రూరల్: కాకినాడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు మత్తుకు వ్యతిరేకంగా శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా వాకలపూడి ఇండస్ట్రియల్ పార్కులో యూనివర్సల్ బయో ఫ్యూయల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కార్మికులకు మద్యం తాగుడు వలన కలిగే దుష్పరిమాణాలపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఎం.కృష్ణకుమారి, నార్త్ స్టేషన్ సీఐ రామ్మోహనరావు, ఎస్సైలు వరహాలు, ఎండీ ఆలీ, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్లక్ష్యం నీడలో..

- అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయ పాలన పాటించని సిబ్బంది
- పొంతన లేని ప్రీ స్కూల్ పిల్లల నమోదు, హాజరు
- అక్రమాలకు పాల్పడుతున్న సిబ్బంది
- కేంద్రాలపై కొరవడిన పర్యవేక్షణ



ఇద్దరు పిల్లలు మాత్రమే ఉన్న కేపీ మల్లవరం అంగన్‌వాడీ కేంద్రం-2

కోటనందూరు: చిన్నారులకు ఆటపాటలతో విద్యాబుద్ధులు నేర్పించి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయడమే లక్ష్యంగా ఏర్పడిన అంగన్‌వాడీ కేంద్రాలు ప్రస్తుతం నిర్లక్ష్యం నీడలో కొట్టుమిట్టాడుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యానికి తూట్లు పొడుస్తూ సిబ్బంది కేంద్రాలను అధ్వానంగా నిర్వహిస్తున్నారు. సిబ్బంది ఎవరూ సమయ పాలన పాటించడం లేదు. కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలు లేని పరిస్థితి నెలకొంది. అంగన్‌వాడీ కేంద్రాలను కేవలం పౌష్టికాహారం పంపిణీ చేసే కేంద్రాలుగా మార్చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

51 కేంద్రాల్లో..

కోటనందూరు మండలంలో రెండు క్లస్టర్ల పరిధిలో 51 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో గర్భిణులు 167 మంది, బాలింతలు 247 మంది, 3 సంవత్సరాల లోపు పిల్లలు 1192, ప్రీ స్కూలు పిల్లలు 786 మంది ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రతి కేంద్రంలోనూ ప్రీస్కూల్ పిల్లల సంఖ్య 10కి మించి నమోదు చేశారు. వాస్తవానికి కేంద్రానికి వచ్చే పిల్లల సంఖ్య కేవలం 3 నుంచి 4కు మించడం లేదు. గ్రామంలో లేని, ప్రైవేటు పాఠశాలలోని పిల్లలను రికార్డుల్లో నమోదు చేయడం గమనార్హం. ఇలా ఎందుకు నమోదు చేస్తున్నారని ప్రశ్నించిన వారికి సిబ్బంది, అధికారులు పెద్ద ఉపోద్ఘాతం చెబుతున్నారు.

భారీ అక్రమాలు !

అంగన్‌వాడీ కేంద్రాల్లో భారీగా అక్రమాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదనపు పిల్లల నమోదుతో మిగిలిన కందిపప్పు, బాలామృతం ప్యాకెట్లను స్థానికంగా విక్రయించేస్తున్నారని మండి పడుతున్నారు. కేంద్రాలపై పర్యవేక్షణ కొరవడడమే ఈ దుస్థితికి కారణమని చెబుతున్నారు.

అందని విద్యాబుద్ధులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు కనీస విద్యాబుద్ధులు అందడం లేదని పల్లె ప్రజలు ఆరోపిస్తున్నారు. కేంద్రాల్లో ఆటపాటలు కనిపించడం లేదని చెబుతున్నారు. ఈ విషయంపై ఇటు సిబ్బంది, అటు అధికారులు దృష్టి సారించకపోవడం గమనార్హం. అంగన్‌వాడీ సిబ్బంది నిర్లక్ష్యంతోనే కేంద్రాల్లో పిల్లల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది.

మధ్యాహ్నమైతే మూసివేత

అంగన్‌వాడీ సిబ్బంది సమయ పాలన పాటించడం లేదు. ఉదయం 8.30 గంటలకు రావాల్సిన ఆయాలు, 9 గంటలకు రావాల్సిన వర్కర్లు నిర్ణీత సమయానికి రావడం లేదు. పిల్లలను తీసుకురావడంలో ఆయాలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ఉదయం 11 గంటలకు కూడా చాలా కేంద్రాల్లో పిల్లలు ఉండడం లేదు. కొన్ని కేంద్రాల్లో ఆయాలకు తమ కేంద్రంలో ఎంత మంది పిల్లలున్నారనే విషయం కూడా తెలియని పరిస్థితి నెలకొంది. మధ్యాహ్నం తరువాత కేంద్రాలు పూర్తిగా మూత పడుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.

నిరంతర పర్యవేక్షణ ఉండాలి



అంగన్‌వాడీ కేంద్రల్లో పిల్లలకు ప్రభుత్వ లక్ష్యం మేరకు చక్కని ఆటపాటలతో విద్యాబుద్ధులు నేర్పించాలి. అధికారులు ఆ దిశగా సిబ్బందికి ఆదేశాలు ఇవ్వాలి. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలి. సిబ్బంది నిర్లక్ష్యంతోనే కేంద్రాల్లో పిల్లల సంఖ్య పడిపోతుంది.

అయిల వీరబాబు, కోటనందూరు

సత్యదేవుని దర్శించిన డార్ట్స్ చైర్మన్



సత్యదేవుని సన్నిధిలో జస్టిస్ అనిల్‌కుమార్, రాష్ట్ర డార్ట్స్ ప్రిసైడింగ్ ఆఫీసర్ కృష్ణ గోపాల్ ద్వివేది దంపతులు

అన్నవరం: కేంద్ర ప్రభుత్వ డెబిట్స్ రికవరీ అప్పిలేట్ ట్రిబ్యునల్స్ (డార్ట్స్) చైర్మన్ (కలకత్తా) జస్టిస్ అనిల్‌కుమార్, రాష్ట్ర డార్ట్స్ ప్రిసైడింగ్ ఆఫీసర్ కృష్ణ గోపాల్ ద్వివేది కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేసి సత్యదేవుని ప్రసాదాలు బహూకరించారు. వారి వెంట స్థానిక ఎస్‌బీఐ బీఎం భరద్వాజ్ ఉన్నారు.

అక్రమ అరెస్టులు ఆపకపోతే మూల్యం తప్పదు

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు జాన్ వెస్లీ



విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సేల్ ఉపాధ్యక్షుడు వెస్లీ

జగ్గంపేట: కూటమి ప్రభుత్వం అక్రమ అరెస్టులను ఆపకపోతే భారీ మూల్యం చెల్లించక తప్పదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు జాన్‌వెస్లీ హెచ్చరించారు. జగ్గంపేటలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టు ప్రతిపక్షం గొంతునొక్కాలని చేసే ప్రయత్నంలో భాగమేనని విమర్శించారు. వైఎస్సార్ సీపీ నేతలను సంబంధం లేని కేసుల్లో ఇరికించి అరెస్టు చేయాలని కూటమి ప్రభుత్వం చూస్తోందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మద్యాన్ని నియంత్రించి ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటే ప్రస్తుతం మద్యం కుంభకోణం పేరుతో నేతలను అరెస్టు చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో బెల్టుషాపులు పెరిగిపోయాయని, గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం మద్యం తాగమని ప్రోత్సహించి మరో పక్క పోలీసులతో దాడులు చేయించి అరెస్టులు చేస్తోందన్నారు. పెగ్గు తాగించి పైసలు వసూలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు క్రిస్టియన్ మైనారిటీ నేతలు పాల్గొన్నారు.

ముద్రగడ ఆరోగ్యం మెరుగుపడాలని పూజలు



యర్రవరంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



ఎ.మల్లవరంలో ప్రార్థనలు చేస్తున్న మహిళలు



పోతులూరు కృష్ణాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడాలని కోరుతూ ఆ పార్టీ శ్రేణులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ నేతలు గొల్లపల్లి సురేష్, భీశెట్టి అప్పలరాజు ఆధ్వర్యంలో యర్రవరంలోని ప్రసన్నాంజనేయస్వామి భారీ విగ్రహం వద్ద 101 కొబ్బరికాయలు కొట్టారు. ముద్రగడ త్వరగా కోలుకోవాలని స్వామివారిని కోరుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, బదిరెడ్డి గోవింద్, సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు, గొల్లపల్లి కాశీ విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ముద్రగడ ఆరోగ్యం మెరుగుపడాలని ప్రార్థనలు

రౌతులపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడాలని కోరుతూ శనివారం మండలంలోని ఎ.మల్లవరంలో మహిళలు ప్రార్థనలు చేశారు. మాజీ ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ జిల్లా అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు అంగూరి లక్ష్మీశివకుమారి ఆధ్వర్యంలో గ్రామంలోని మహిళలు ముద్రగడ ఆరోగ్యం మెరుగుపడి త్వరగా కోలుకోవాలని కోరుతూ ఏసుక్రీస్తుకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు క్రీస్తు విశ్వాసులు పాల్గొన్నారు.

ముద్రగడ త్వరగా కోలుకోవాలి

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడి త్వరగా కోలుకోవాలని కోరుతూ ఆ పార్టీ శ్రేణులు శనివారం పూజలు చేశారు. మండలంలోని పోతులూరు కృష్ణాలయంలో కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ కట్టడంపై గరంగరం



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు గోవింద్, గోపి

- అధికారుల తీరుపై మండిపడిన కౌన్సిలర్లు
- వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

ఏలేశ్వరం: స్థానిక నగర పంచాయతీ కార్యాలయ సమీపంలో చేపట్టిన అక్రమ కట్టడం నిర్మాణంపై కౌన్సిల్ సభ్యులు మండిపడ్డారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అక్రమ కట్టడాలపై కౌన్సిలర్లు నిరసన తెలిపారు. 3వ వార్డు కౌన్సిలర్ బదిరెడ్డి గోవింద్ మాట్లాడుతూ నగర పంచాయతీ సమీపంలో కోనేటి చెరువును ఆనుకొని అక్రమ నిర్మాణం జరుగుతున్నా మున్సిపల్ అధికారులకు స్పందన లేదన్నారు. సామన్యులు నిర్మాణాలు చేపడితే వారి పనిముట్లు తీసుకువచ్చే అధికారులు అక్రమ నిర్మాణంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. చైర్‌పర్సన్ ఇంటి ముందే అక్రమ నిర్మాణం జరుగుతున్నా అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. దీనిపై తోటి కౌన్సిలర్లు స్పందించాలని గోవింద్ కోరారు. 4వ వార్డు కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి మాట్లాడుతూ అక్రమ కట్టడాలపై అధికారులు చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలపై ఇప్పటికే నోటీసులు ఇచ్చామన్నారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కోటాలో ఇద్దరికి ట్రిపుల్ ఐటీ సీట్లు



బి.సాయిభరత్



సీహెచ్ రేవంత్ కౌశిక్

తుని రూరల్: ఎన్‌సీసీ విభాగంలో ఇద్దరు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ సీట్లు లభించినట్టు హంసవరం ఏపీ మోడల్ స్కూల్, కళాశాల ప్రిన్సిపాల్ టీవీ శివలక్ష్మి శనివారం తెలిపారు. ఏపీ మోడల్ స్కూల్లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఎన్‌సీసీలో శిక్షణ పొందుతున్నారన్నారు. బి.సాయిభరత్‌కు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు లభించగా సీహెచ్.రేవంత్ కౌశిక్ వెయిటింగ్‌లో లిస్ట్‌లో ఉన్నట్టు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

బాధిత కుటుంబాలకు 'తోట' పరామర్శ



జెడ్.రాగంపేటలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న తోట రాంజీ

గండేపల్లి: మండలంలోని పలు బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట రాంజీ శనివారం పరామర్శించారు. మండలంలోని నీలాద్రిరావుపేటలో ఇటీవల మృతి చెందిన బొడ్డు సూర్యనారాయణ, జెడ్.రాగంపేటలో దొరయ్య కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రామకుర్తి మూర్తి, నీలాద్రిరావుపేట సర్పంచ్ ములంపాక సురేష్, కాకి శ్రీను, పాలచర్ల వెంకన్న చౌదరి, తదితరులు ఉన్నారు.

గోకవరంలో రేపు లక్కీ డ్రా



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కంబాల శ్రీనివాస్‌రావు

గోకవరం: బంగారు వరలక్ష్మి కానుక-3 లక్కీ డ్రాను ఈ నెల 28న గోకవరంలో నిర్వహిస్తున్నట్టు విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, భారతీయ జనతా పార్టీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సత్య కృష్ణ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. మహిళా భక్తుల్లో హైందవ చైతన్యం తీసుకురావాలనే సంకల్పంతో గత రెండు సంవత్సరాల నుంచి బంగారు వరలక్ష్మి కానుక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా బంగారు వరలక్ష్మి కానుక-3కి శ్రీకారం చుట్టామన్నారు. ఈ నెల 28న సోమవారం గోకవరం సూర్య ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ లక్కీ డ్రా నిర్వహించి, గెలుపొందిన మహిళలకు వరలక్ష్మి రూపులను ఉచితంగా అందజేస్తామన్నారు. 29న గోకవరం చుట్టు పక్కల గ్రామాలు, 30న కోరుకొండ మండలం శ్రీరంగపట్నం, ఆగస్టు 2న కోరుకొండ, 3న అల్లూరి సీతారామరాజు జిల్లా ఇందుకూరుపేట, 4న ఉదయం రంపచోడవరం, మధ్యాహ్నం అడ్డతీగల, 5న సీతానగరం, 6న రాజానగరం గ్రామాలలో బంగారు వరలక్ష్మి కానుక లక్కీ డ్రా నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ సభను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆరుగుల మోషే

కోటనందూరు: హక్కుల సాధన కోసం వచ్చే నెల 1న రాజమహేంద్రవరంలో నిర్వహించే ఎమ్మార్పీఎస్ సభను జయప్రదం చేయాలని మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరుగుల మోషే పిలుపునిచ్చారు. మండలంలోని కేఈ చిన్నయ్యపాలెం, పాతకొట్టాం, కొత్తకొట్టాం, ఎల్లీపేట, కోటనందూరు గ్రామాల్లో శనివారం మాదిగ తండాల్లో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మోషే మాట్లాడుతూ సమస్యల సాధనకు మాదిగలంతా ఏకతాటిపై నడవాలన్నారు. సభకు మాదిగ ప్రతినిధులు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సభలో వర్గీకరణ ఆద్యుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగను సన్మానిస్తామని తెలిపారు.

రత్నగిరికి పోటెత్తిన భక్తులు

- స్వామి దర్శనానికి 40 వేల మంది
- 2,500 వ్రతాల నిర్వహణ
- ఆలయానికి రూ.30 లక్షల ఆదాయం



సత్యదేవుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

అన్నవరం: సత్యగిరిపై వేంకట సత్యనారాయణ స్వామి దర్శనానికి శనివారం సుమారు 40 వేల మంది భక్తులు తరలిరావడంతో ఆలయప్రాంగణం, వ్రతమండపాలు, విశ్రాంత మండపాలు కిక్కిరిశాయి. శ్రావణమాస తొలి శనివారం కావడంతో భారీగా భక్తులు రావడంతో దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. స్వామివారి వ్రతాలు 2,500 నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా ఆలయానికి రూ.30 లక్షలు ఆదాయం సమకూరింది. సుమారు ఐదువేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

నేడు సత్యదేవునికి జన్మ నక్షత్ర పూజలు

సత్యదేవుని జన్మనక్షత్రం 'మఖ' సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున సత్యదేవుడు, అమ్మవారి మూలవిరాట్‌లు, శంకరునికి పంచామృతాలతో మహాన్యాస పూర్వక అభిషేకం నిర్వహిస్తారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



బెండపూడి జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొట్టి ఆగిన కారు

తొండంగి: జాతీయ రహదారిపై మండలంలోని బెండపూడి వద్ద లారీ కారును ఢీకొట్టిన ఘటనలో త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం రాజమహేంద్రవరం వైపు నుంచి అన్నవరం వైపు వెళ్తున్న లారీ ముందు వెళ్తున్న కారును బెండపూడి వద్ద బలంగా ఢీకొట్టింది. దీంతో కారు డివైడర్‌ను ఢీకొట్టి ఆగింది. కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. డివైడర్ లేకుంటే విశాఖ నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే మార్గంలోకి వెళ్లి పెను ప్రమాదం జరిగేది. దీనిపై తొండంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఈ ప్రమాద ఘటనతో హైవేపై ట్రాఫిక్ నిలిచిపోయింది. హైవే పెట్రోలింగ్ సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అనంతరం వాహనాల రాకపోకలు యథావిధిగా సాగాయి.


దరఖాస్తుల ఆహ్వానం

జగ్గంపేట: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పలు తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లలిత కుమారి శనివారం తెలిపారు. ఖాళీ ఉన్న సీట్లను రిజర్వేషన్ ప్రకారం భర్తీ చేస్తామన్నారు. ఆసక్తి గల ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కళాశాలలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు.

పంపా ఆయకట్టుకు నీరు విడుదల



పంపా నదికి పూజలు చేస్తున్నప్రాజెక్ట్ చైర్మన్ చందు, రాజేష్



పంపా కాలువలో ప్రవహిస్తున్న నీరు

అన్నవరం: తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో 12,500 ఎకరాల ఆయకట్టుకు పంపా రిజర్వాయర్ నుంచి శని వారం సాగు నీటిని విడుదల చేశారు. ఉదయం తొమ్మిది గంటలకు దేవస్థానం పండితులు ప్రాజెక్ట్ వద్ద గంగమ్మతల్లికి పూజలు చేశారు. ప్రాజెక్ట్ చైర్మన్ చందు, ఇరిగేషన్ ఈఈ (పెద్దాపురం డివిజన్) జి.శేషగిరి రావు, నీటి సంఘాల అధ్యక్షుడు, రైతు నాయకుడు యనమల రాజేష్ తదితరులు పంపా నదికి పసుపు, కుంకుమ, చీర, సారె సమర్పించారు. అనంతరం స్లూయిజ్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ ప్రస్తుతం 40 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నామని, రైతుల అవసరాలకు అనుగుణంగా నీటి విడుదలను పెంచుతామని తెలిపారు. ఈ ఏడాది పూర్తి స్థాయిలో పంపా ఆయకట్టులో 12,500 ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పారు.

94 అడుగులకు చేరిన పంపా నీటిమట్టం

పంపా రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 103 అడుగులు కాగా, శనివారం ఉదయానికి నీటిమట్టం 94 అడుగులకు చేరింది. ఆయకట్టుకు 40 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్‌లోకి 110 క్యూసుక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ఈఈ తెలిపారు. నీటి మట్టం పెరిగే అవకాశం ఉందన్నారు. పంపా రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యం 0.43 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.15 టిఎంసీల నీరు నిల్వ ఉంది. కార్యక్రమంలో తొండంగి, ఎ.కొత్తపల్లి, పైడికొండ, వేమవరం గ్రామాల రైతులు, ఇరిగేషన్ గుమస్తా శ్రీదేవి పాల్గొన్నారు.